రేపు అండర్-19 క్రికెట్ ఎంపికలు

సుభాష్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అండర్-19 క్రికెట్ ఎంపికలు సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రసేన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ మైదానంలో ఈ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలకు 19 సంవత్సరాల లోపు, 16 సంవత్సరాల పైన ఉన్న బాలురు ఈ ఎంపికలకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డు వెంటతెచ్చుకోవాలని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం కోచ్ నయీ మ్ 8106060600 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



ఉప్లూర్ గ్రామంలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేస్తున్న కమ్మర్‌పల్లి ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు

విద్యార్థుల చెంతకే అధ్యాపకులు

- మరోవైపు బడి బాటతో ఉపాధ్యాయులు
- జిల్లాలో జోరందుకున్న విద్యా ప్రచారాలు

కమ్మర్‌పల్లి జూన్7 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యాసంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యాశాఖ ప్రచారాలు జోరందుకున్నాయి. ప్రభుత్వ పాఠశాల, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యార్థుల చెంతకు చేరి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న సదుపాయాలను వివరిస్తూ వారిని ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చేరేలా నచ్చజెప్తున్నారు. విద్యార్థులు పెట్టుకున్న లక్ష్యం.. అందుకు అనుగుణంగా ఏ గ్రూప్ తీసుకుంటే బాగుంటుందనే విషయాలు అధ్యాపకులు వివరిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని, సదుపాయాల కల్పన, ఉత్తీర్ణతాశాతం గురించి వివరిచేందుకు కరపత్రాలను ముద్రించి ప్రచారం చేస్తున్నారు. కమ్మర్‌పల్లి మండకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రచారాలు సాగిస్తున్నారు. కమ్మర్‌పల్లిలోని ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విదను అందిస్తున్నామని, తమ పిల్లలను కమ్మర్‌పల్లిలోని ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతూ (మిగతా 8వ పేజీలో..)



హసాకొత్తూర్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ



రాజీవ్ యువ వికాసం

మరింత ఆలస్యం!

- ఈనెల 2న జరగాల్సిన యూనిట్ల పంపిణీ వాయిదా
- లబ్ధిదారుల్లో నిరాశ
- జిల్లాలో 59వేల 27 దరఖాస్తులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కోసం వివిధ రంగాలలో పెట్టుబడి సహాయం అందించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. ఈనెల 2న రాష్ట్ర అవతరణ వేడుకల్లో లక్ష రూపాయల లోపు లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు పత్రాలు ఇచ్చేందుకు నిర్ణయించినప్పటికీ చివరి నిమిషంలో వాయిదా చేసింది. దీంతో తమకు రుణాలు అందుతాయని అనుకున్న లబ్ధిదారులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. వ్యవసాయ రంగంతో పాటు చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో యువత ఆర్థిక అభివృద్ధి చెందేలా ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా 50వేల లోపు యూనిట్లు ఏర్పాటు చేసుకునే యువతకు వంద శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. లక్షలోపు రుణాలు తీసుకునే వారికి 90శాతం, 2లక్షల వరకు రుణాలు తీసుకునే వారికి 80శాతం, రూ.4లక్షల వరకు రుణాలు పొందేవారికి 70శాతం సబ్సిడీపై రుణాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. బ్యాంకుల ద్వారా పొందే సబ్సిడీని ప్రభుత్వమే చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం రాష్ట్రప్రభుత్వం 6వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. జిల్లాలో పెద్దసంఖ్యలో రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు వచ్చాయి. కానీ చివరి క్షణంలో రుణాల పంపిణీ వాయిదా పడటంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకొని పంపిణీ చేస్తామని ప్రకటించినప్పటికీ గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో రుణాల పంపిణీ ఎప్పుడు చేస్తారో స్పష్టంగా చెప్పకపోవడంతో రుణాల పంపిణీ మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఇప్పటికే ఎంపికైన లబ్ధిదారులు, ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు.

జిల్లాలో 59వేల 27 దరఖాస్తులు

రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలోని 31 మండలాల్లోని 545 గ్రామపంచాయతీలు, 800లకు పైగా గ్రామాలు ఉన్నాయి. నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు ఆర్మూర్, బోధన్, భీంగల్ మున్సిపాలిటీల పరిధిలో 15 లక్షలకు పైగా జనాభా ఉంది. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, క్రిస్టియన్, సామాజిక వర్గాల నుంచి పెద్దసంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకానికి అన్ని కార్పొరేషన్‌లు కలిపి 22వేల 120 యూనిట్లు టార్గెట్ కాగా, 59వేల 27 దరఖాస్తులు రాగా, ఇందులో ఎస్సీ కార్పొరేషన్‌కు 10వేల 861 దరఖాస్తులు, ఎస్టీ కార్పొరేషన్‌కు 4వేల 584 దరఖాస్తులు, బీసీ కార్పొరేషన్‌కు 29వేల 473 దరఖాస్తులు, ఈబీసీ/ఈడబ్ల్యుఎస్‌కు 1327 దరఖాస్తులు, మైనార్టీ కార్పొరేషన్‌కు 12వేల 502 దరఖాస్తులు, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్‌కు 280 దరఖాస్తులు వచ్చాయి.

4లక్షల రుణాలకే అధిక దరఖాస్తులు

రాజీవ్ యువవికాసం పథకానికి జిల్లాలోని నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం ఒకేసారి కాకుండా నాలుగు విడతల్లో రుణాలు అందించేందుకు ఏర్పాట్లు చేసింది. కేటగిరి-1 50వేలలోపు, కేటగిరి-2 లక్షలోపు, కేటగిరి-3 లక్ష నుంచి 2లక్షలలోపు, కేటగిరి-4 2 లక్షల నుంచి 4లక్షలలోపు రుణాలు అందించేందుకు ఏర్పాట్లుచేసింది. జిల్లాలో 50వేల లోపు రుణాల కోసం అతితక్కువ దరఖాస్తులు వచ్చాయి. టార్గెట్ 7వేల 125 ఉండగా కేవలం 2వేల 53 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇందులో ఎస్సీ కార్పొరేషన్‌లో టార్గెట్ 964కు 509 (మిగతా 8వ పేజీలో..)



లబ్ధిదారుల్లో తీవ్ర నిరాశ

ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాజీవ్ యువవికాసం పథకం ద్వారా యూనిట్ల స్థాపనకు దరఖాస్తులు స్వీకరించి కేటగిరి-1, కేటగిరి-2 లబ్ధిదారులకు ఈనెల 2న రుణాలు అందజేస్తారని ప్రకటించినా చివరి నిమిషంలో రుణాల పంపిణీ వాయిదా పడటంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఇప్పటికే కొన్ని మండలాల పరిధిలో లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారు. జూన్ 9 వరకు లబ్ధిదారులకు రుణాల మంజూరు పత్రాలు పంపిణీ చేసి ఈనెల 15లోపు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. నెలాఖరు లోపు బ్యాంకుల నుంచి సబ్సిడీ వచ్చేలా కూడా ఏర్పాట్లు చేశారు. కానీ చివరి నిమిషంలో రుణాల పంపిణీ వాయిదా పడటంతో లబ్ధిదారులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో ఈ పథకం ప్రారంభించడం ఇబ్బందికరంగా మారినట్లు తెలుస్తోంది. కేటగిరి-1, కేటగిరి-2 యూనిట్లలో లబ్ధిదారుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ 2లక్షల లోపు, 4లక్షల లోపు రుణాలు పొందేవారు అధిక సంఖ్యలో ఉండటంతో పథకం ప్రారంభించి మళ్లీ మధ్యలో ఆపితే విమర్శలు వస్తాయనే కారణంతో పథకాన్ని వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

నిజామాబాద్‌లో తొలి కరోనా కేసు నమోదు

- జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన వ్యక్తికి పాజిటీవ్
- అప్రమత్తమైన వైద్య శాఖ



నిజామాబాద్ అర్బన్, జూన్7 (ఆంధ్రజ్యోతి): కరోనా మళ్లీ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలో మొదటి కరోనా కేసు శనివారం నమోదైంది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి కరోనా పాజిటీవ్ వచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పాజిటీవ్ వచ్చిన వ్యక్తి కుటుంబ సభ్యుల నమూనాలను సేకరించి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేశారు. పాజిటీవ్ వచ్చిన వ్యక్తిని క్వారంటైన్‌కు పంపించారు. కరోనా మళ్లీ వ్యాప్తి చెందుతున్న తరుణంలో జిల్లాలో మొదటి కేసు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఉమ్మడి జిల్లాలో ఉత్కంఠ

నిజామాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణపై ఉమ్మడి జిల్లా పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ రేపుతుంది. ఈ దఫానైనా రెండో విడత మంత్రివర్గ విస్తరణలో అవకాశం వస్తుందా లేదా అన్న చర్చ సాగుతోంది. మొదటి నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి అవకాశం వస్తుందని ప్రచారం జరుగుతున్న తొలి విడతలో రాలేదు. ఉమ్మడి జిల్లా నుండి నలుగురు ఎమ్మెల్యేలు ఉన్న కీలక పదవిని ఇవ్వలేదు. రెండవ విడత విస్తరణలో ఆయనకు మంత్రి వస్తుందని ప్రచారం సాగుతోంది. రాష్ట్రంలో సామాజిక సమీకరణాల ప్రకారం రెండో విడతలో అవకాశం ఇస్తామని ప్రచారం కొనసాగుతున్న ఉమ్మడి జిల్లాకు ఈ దఫా అవకాశం వస్తుందని పార్టీ నేతలు బావిస్తున్నారు.



గత కాంగ్రెస్ ప్రభుత్వకాలంలో ప్రతీ క్యాబినేట్‌లోనూ ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు వచ్చేవి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం కూడా బీఆర్ఎస్ హయాంలోనూ జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చారు. రెండు క్యాబినెట్‌లలోనూ అవకాశం కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిజామాబాద్‌కు మంత్రి పదవిలో అవకాశం రాలేదు. ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా, ఏడుగురికి కార్పొరేషన్ ఛైర్మన్లుగా అవకాశం వచ్చింది. ఉమ్మడి జిల్లా నుండి నలుగురు ఎమ్మెల్యేలు ఉన్న ఇప్పటికి ఇప్పటి వరకు మాత్రం అవకాశం రాలేదు. ముగ్గురు ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతరావు, భూపతిరెడ్డి మొదటిసారి ఎంపిక కావడంతో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికే మొదటి నుంచి అవకాశం వస్తుందని అంచనా వేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైద్యఆరోగ్య శాఖ, భారీ నీటి పారుదలశాఖ మంత్రిగా ఆయన పనిచేశారు. ఈ దఫా ఆయనకే అవకాశం వస్తుందని పార్టీ శ్రేణులు అంచనాకు వస్తున్నారు. రాష్ట్రంలో ఎవరికి మంత్రి పదవులు వస్తాయో నిజామాబాద్ జిల్లా నుంచి ఇస్తారైనా తగిన ప్రాధాన్యం ఉంటుందో లేదో నేడు తేలే అవకాశం ఉంది.



ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతోపాటు ఉద్యోగులనూ మోసం చేసింది

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆరు గ్యారెంటీలతో ప్రజలతో పాటు ఉగ్యోగులనూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. నిజామాబాద్ క్యాంప్ కార్యాలయంలో శనివారం రాత్రి తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నేతలు ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చారన్నారు. ఉద్యోగులకు ప్రతీనెల 1న వేతనాలు ఇవ్వడంతో పాటు డీఏలు ఎప్పటికప్పుడు చెల్లిస్తామని హామీలిచ్చారన్నారు. పీఆర్సీ ద్వారా మెరుగైన ఫిట్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. ఏ ఒక్క హామీని ఇప్పటివరకు ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. ఐదు డీఏలను పెండింగ్‌లో పెట్టి ఉద్యోగులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. జూలై 1న చెల్లించాల్సిన మరో డీఏను కలుపుకుంటే మొత్తం ఆరు డీఏలు ఉద్యోగులకు ప్రభుత్వం బాకీ పడిందన్నారు. ఇప్పుడు ఒక జీవో.. తర్వాత ఇంకో జీవో ఇస్తామని కేబినేట్‌లో నిర్ణయం తీసుకోవడం ఉద్యోగులను వంచించడమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను అన్నిరకాల మోసం చేయడంతో పాటుగా కనీసం మధ్యంతర భృతిని కూడా ఇవ్వలేదన్నారు. వచ్చే దసరా పండుగ లోపు ఆరు డీఏల్లో మూడు డీఏలు ఇవ్వకపోతే ఉద్యోగుల పక్షాన ఉద్యమిస్తామని ఆమె అన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అసోసియేషన్ల అధ్యక్షుడు నాగరాజు, రేవంత్‌తో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

నవీపేటలో ఎమ్మెల్సీ కవిత పర్యటన

నవీపేట: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం నవీపేటలో పర్యటించారు. మండల బీఆర్ఎస్ నాయకులు సూరి బాబు కుమారుడు సాయి తేజకు ఇటీవల వివాహం కాగా, నూతన వధూ వరులను ఎమ్మెల్సీ కవిత ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పోసాని అనే వృద్ధురాలు ఎమ్మెల్సీ కవితను కలిసి వృద్ధాప్య పింఛన్‌ను 2వేల నుంచి 4వేల రూపాయలకు పెంచాలని కోర గా రాష్ట్ర ప్రభుత్వంతో కొట్లాడి పింఛన్‌ల పెంపును సాధిద్దామని వృద్ధు రాలికి హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని అబ్బాపూర్(ఎం)లో నవీపేట సొసైటీ ఛైర్మన్ అబ్బన్నను పరామర్శించారు. ఇటీవల (మిగతా 8వ పేజీలో..)

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

- జిల్లావ్యాప్తంగా ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, అధికారులు



ప్రవచనాలు ఇస్తున్న ఇమామ్



నిజామాబాద్ నగరంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

నిజామాబాద్ కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బక్రీద్ వేడుకలను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రపంచశాంతి కోరుతూ ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన ప్రార్థనలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాలుపంచుకొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన తర్వాత ఒకరికొకరు అలయ్ బలయ్ చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ద్గాల వద్ద ముస్లీం మత పెద్దలు పండుగ విశిష్టతను తెలియజేశారు. దైవప్రవక్త హజ్రత్ ఇబ్రహీమ్ త్యాగాన్ని ప్రతీఒక్కరు గుర్తు చేసుకుంటూ పండుగ చేసుకోవాలని అన్నారు. కుర్బాని ఇవ్వడం అంటే దేవుడి ఆజ్ఞను పాటిం చడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించడమేనని అన్నారు. ఈ విధమైన స్ఫూర్తి, భక్తి పరాయణత విశ్వాసాల్లో కనిపించకపోతే పుణ్యాన్ని దైవ అనుగ్రహాన్ని పొందలేరని అన్నారు. బక్రీద్ రోజున అల్లాహ్‌కు ఎంతో ప్రీతికరమైన ఆరాధాన, త్యాగం అని దానివల్ల పాప ప్రక్షాళన జరిగి దేవుడి అనుగ్రహం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతీ ఒక్క ముస్లిం సోదరుడు దైవ నిర్ణయానికి అనుగుణంగా కుర్బానిని సంతోషంగా ఇవ్వాలని అందుకు మనకు మార్గాన్ని చూపిన దైవ ప్రవక్త మహమ్మద్, ఇబ్రత్ ఇబ్రహీమ్ వంటి వారు ఎంతో మంది స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. త్యాగం చేసిన వారిని లోకంలో చిరకాలం గుర్తుంచుకుంటారని సమాజ శ్రేయస్సులో వారి త్యా గాలే కీలకం అవుతాయని త్యాగం నుంచే సమర్థవంతమైన నాయకత్వం ఉద్భవిస్తుందని పేర్కొన్నారు.



నగరంలో బక్రీద్ వేడుకల్లో చిన్నారులు, యువత

ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

ముస్లింలు రంజాన్ తర్వాత జరుపుకునే పెద్ద పండుగ బక్రీద్ కావడంతో ఈద్గాల వద్ద పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలో లోకకళ్యాణం కోసం ప్రపంచ శాంతి జరగాలని కోరుకుంటూ ప్రార్థనలు చేశారు. ముస్లింలు చిన్నా పెద్ద తేడా లేకుండా ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలు పుకున్నారు. పలు ప్రాంతాల్లో త్యాగానికి ప్రతి రూపకంగా పండుగను జరుపుకున్నారు. జిల్లాకేంద్రంలోని ఖిల్లా ప్రాంతంలో ప్రధాన ఈద్గాతో పాటు వివిధ ప్రాంతాల్లోని ఈద్గాలు ముస్లిం (మిగతా 8వ పేజీలో..)

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఈద్గా వద్ద బందోబస్తును పర్యవేక్షించిన సీపీ

బోధన్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీపీ సాయి చైతన్య అన్నారు. శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా బోధన్‌లోని ఈద్గా, మసీద్ లవద్ద బందోబస్తులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వెంటవెంటనే పోలీసులు పరిష్కరించాలన్నారు. ఈద్గా పరిసరా ప్రాంతాలను పరిశీ లించారు. ప్రతీఒక్కరు కుల, మతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలన్నారు. సీపీ వెంట నిజామాబాద్ ఏసీపీ శ్రీ రాజవెంకట్‌రెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఏసీపీ రవీందర్, పట్టణ సీఐ వెంకటనారాయణ, పోలీసులు ఉన్నారు.



ఈద్గా పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న సీపీ సాయి చైతన్య

బోధన్ ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూన్7(ఆంధ్రజ్యోతి): బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం కాయకల్ప బృందం సందర్శించింది. వినయ్ సింగ్‌తో వచ్చిన బృందం ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యంపై రోగులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు తదితర 40అంశాలకు సంబంధించి వివరాలను సేకరించామని బృందం సభ్యులు వినయ్ సింగ్ తెలిపారు. ఆసుపత్రిలోని నివేదికను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామన్నారు. బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి కాయకల్ప అవార్డుకు సరిపడ అర్హతలు ఉన్నాయని వీటినికి విడతల వారిగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. పూర్తి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు మెగావత్, మరియా, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాహుల్ కుమార్, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ సుమంత్, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

నాగాపూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఇందిరమ్మ లబ్ధిదారులు

కమ్మర్‌పల్లి, జూన్ 7: (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగ చేపట్టి అమలు పరుస్తున్న ఇందిరమ్మ ఇళ్ల తొలిబిల్లు లక్ష రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో జమకాగా శనివారం నాగాపూర్ గ్రామ లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండలంలో ఫైలెట్ గ్రామంగా నాగాపూర్ గ్రామాన్ని ఎంపిక చేసి గ్రామంలోని మొదటి విడతగా 81 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా రెండో విడత మరో 5 మందికి మంజూరు వచ్చింది. ఇందులో 40 ఇళ్లకు మార్క్ అవుట్ ఇవ్వగా 9 మంది లబ్ధిదారుల ఇళ్లు బేస్‌మెట్ లెవల్‌కు చేరుకోవడంతో వారికి ప్రభుత్వం మొదటి విడతగా లక్ష రూపాయలు వారవారి బ్యాంక్ ఖతాల్లో జమచేయడం జరిగిందని మిగిలిన ఇండ్లనిర్మాణ పనులు కొనసాగుతన్నట్లు కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ కప్పదండి అశోక్, కాంగ్రెస్ నాయకులు పాలెపు రాజేశ్వర్, శశిధర్, కిషన్, గంగాధర్, రమేష్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

దళిత రత్న అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న నాగభూషణ్

నవీపేట,జూన్7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామకు చెందిన జి.నాగభూషన్ శనివారం దళిత రత్న అవార్డు అందుకున్నారు. మహనీయుల జయంతి సందర్భంగా సికింద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో శనివారం కమిటీ చైర్మన్ ఇటుక రాజు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఎం. శివ, గౌరవ అధ్యక్షులు రాజ్ గగన్ తదితరులున్నారు.



ఏర్గట్లలో బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు



మైనారిటీలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



నందిపేటలో..

జిల్లా అంతటా బక్రీద్ పండుగ వేడుకలు

ఏర్గట్ల,జూన్ 7(ఆంధ్రజ్యోతి):బక్రీద్ పర్వదిన వేడుకలు శనివారం మండలంలోని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ రోజున ముస్లింలు ఉదయాన్నే ఈద్గాలకు తెల్లవారు జామునే నుండే కొత్త బట్టలు ధరించి ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ముస్లింలు సోదరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలాల్లోని అన్ని గ్రామాలలో మైనారిటీ సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం నుండి మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టినట్లు ఈద్గా ఇమామ్ తెలిపారు. ప్రార్థనల అనంతరం మైనారిటీ సోదరులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అలయ్ బలయ్‌తో బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శరత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శరత్ రెడ్డి, ప్రభాకర్, ధూప్‌సింగ్, తలారి నవీన్, గుండెటి శంకర్, ప్రమోద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్ తదితరులున్నారు.

నవీపేట: మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. నవీపేట, నాగేపూర్, యంచ, బినోల, నాగేపూర్ తదితర గ్రామాలలోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రుద్రూరు: రుద్రూరు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం బక్రీద్ పండుగ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కోటగిరి:త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను ముస్లింసోదరులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లోని పలు గ్రామాలలో ఈద్గాల వద్ద ముస్లింసోదరులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం ఒకరినొకరు కలుసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని కుర్బాని చేసి పలువురికి పంచిపెట్టారు. కోటగిరి మండలంలోని కోటగిరి, ఎత్తొండ, యాద్గార్‌పూర్, పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఫారం, హంగర్గ ఫారం, పొతంగల్, కల్లూర్ గ్రామాలలో ముస్లింసోదరులు బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం బక్రీద్ పండగను ముస్లీంలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ గ్రామాలలో ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజ్‌లు చేశారు. అనంతరం మైనార్టీ పెద్దలు ఒకరునొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అక్బర్‌ఖాన్, బడేమియ పాషా, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలంలో శనివారం ముస్లింలు త్యాగాలకు ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్త ఇబ్రహింఅలెసలాం త్యాగాన్ని స్మరించుకుంటూ.. బక్రీద్ పండగ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. శనివారం ఉదయం గ్రామశివాలోని ఈద్గాల వద్దకు తగ్బీర్ ఆలపిస్తూ చేరుకుని పేష్‌ఈమామ్‌ల ఆధ్వర్యంలో ఈద్-ఉల్-అజ్‌హా (బక్రీద్ పర్వదిన ప్రత్యే నమాజ్) సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అంతా సుఖశాంతులతో ఉండాలని వర్షాలు కరవాలని ప్రత్యేక దువాలో అల్లాను వేడుకున్నారు. మండలంలోని చౌట్‌పల్లి ఈద్గాలో హసాకొత్తూర్, బషీరాబాద్, చౌట్‌పల్లి ముస్లింలు, కోనాసముందర్ ఈద్గాలో అమీర్‌నగర్ కోనాసముందర్ గ్రామాల ముస్లింలు, ఉప్లూర్, కమ్మర్‌పల్లి గ్రామాల ఈద్గాలవద్ద అయ గ్రామాల ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్నారు. అనంతరం పరస్పరం ఈద్‌ముబారక్ తెలుపుకున్నారు. బక్రీద్ పర్వదినాన్నిపురష్కరించుకొని మండలం ముస్లిం సోదరులకు మండలంలోని ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుకంకెట బుచ్చన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అధ్యక్షుడు సుంకెట రవి, రేగుంట దేవేందర్ మండల అధికారులు, వివిధ పార్టీ నాయకులు ఆయా గ్రామాల మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు,పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఈద్గాలవద్ద స్థానిక ఎస్సై అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు.

నందిపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం బక్రీద్ పండగ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు అలింగనం చేసుకున్నారు. బక్రీద్ పండగ సందర్భంగా మేకలు, గొర్రెలను బలిచ్చి పేదలకు, బందువులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ముస్లీం మైనార్టీ కమిటీ అధ్యక్షులు శౌకత్ బారీ, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు సయ్యద్ హుస్సెన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ తదితరులు ఉన్నారు.

మాక్లూర్: ముస్లిం సోదరులు శనివారం భక్తి శ్రద్ధలతో మండలంలో బక్రీద్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల వద్ద ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులకు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.

రామారెడ్డి: ముస్లిం సోదరులు ఈద్గా పండగ వేడుకలను వైభవంగా నిర్వహించుకున్నారు. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్, మద్దికుంట, అన్నారం, ఉప్పల్వాయి, పోసానిపేట్, కన్నాపూర్, గిద్ద, మోషంపూర్ తదితర గ్రామాల్లో శనివారం ముస్లింలు చిన్న, పెద్దలు ఒకరికి ఒకరు తోడుగా పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు.. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొని సీట్లు పంచి పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామారెడ్డి ఎస్ఐ రాజారాం నేతృతంలో పోలీసులు ఈద్గా వద్ద భారీ బందోబస్తు నిర్వహిం చారు. అనంతరం ముస్లిం సోదరులు పండుగ శుభాకాంక్షలు తెలుపుకు న్నారు. ఈ కార్యక్రమంలో ముస్లింపెద్దలు, పోలీసులు, తదిత రులు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్ మండల కేంద్రంతో పాటు రెంజర్ల, తదితర గ్రామాలలో శనివారం ముస్లీంలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఈద్ ముభారక్ తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు బద్దంనర్సారెడ్డి, రఫీ, ఫయూం, యాకూబ్‌పాషా, ఇలియాస్ షైమాద్, రహీం, మాజీద్ తదితరులు పాల్గొన్నారు.



హంగర్గ ఫారంలో..



ఒకరినొకరు ముబార్ తెలుపుకుంటున్న ముస్లింలు



కమ్మర్‌పల్లిలో..



ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ జడ్పీ చైర్మన్



జక్రాన్‌పల్లిలో..

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కోటగిరిలో బడిబాట నిర్వహిస్తున్న దృశ్యం



బెల్లాల్‌లో బడిబాట దృశ్యం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో



కుప్కల్ గ్రామంలో అడ్మిషన్లు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

కోటగిరి,జూన్7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కోటగిరి మండల కేంద్రంలోని వినాయక్ నగర్ కాలనీలో ఇంటింటికి వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, డిజిటల్ తరగతి బోధన వంటి అనేక అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. పొతంగల్ మండలంలోని కారేగాం క్యాంప్‌లోనూ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిబాట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేలా కృషి చేస్తామని ఎంఈవో శంకర్ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొలంబాస్, పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలు, వసతులు ఉన్నాయని, సర్కారు బడుల్లోనే విద్యార్థులను చేర్చాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు సూచించారు. శనివారం బెల్లాల్ గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు, సౌకర్యాలు ఉన్నాయని, పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం, తదితర అన్ని రకాల చదువుకు అవసరమయ్యే వస్తువులను ప్రభుత్వం అందజేస్తుందని ప్రిన్సిపాల్ చంద్రకళ అన్నారు. కావున తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీత, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడులలోనే చేర్పించాలని భీమ్‌గల్ ఎంఈవో స్వామి అన్నారు. పట్టణంలో జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ప్లెక్సిలు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, నోట్‌బుక్స్ , యూనిఫాం అందజేస్తున్నామని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింబాద్రి, శివకుమార్, రాజేందర్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలం మోతె గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో కుప్కల్ తాండా, కుప్కల్ గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం వైద్య గణేష్, పీఆర్‌టీయు ప్రధాన కార్యదర్శి సివి నర్సింహారావు, ఉపాధ్యాయులు మంచె గణేష్, మహేందర్,నత్సయ్యలు బడిబాట కార్యక్రమంలో బాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా విద్యబోధన ఉంటుందని ప్రభుత్వం ద్వారా మధ్యాహ్న బోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందించడం జరుగుతుందని వివరించారు.6వతరగతి నుంచి 10 వతరగతి వరకు అడ్మిషన్లు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చిందని వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు వచ్చారని హెచ్ఎం గణేష్ తెలిపారు.

బాల్కొండ:చిట్టాపూర్‌లోని ప్రేమ్‌నగర్ కాలనీలో శని వారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపా ధ్యాయుడు, ఉపాధ్యాయులు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలను గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సుదర్శనచారి, నర్సారెడ్డి, మహర్షి, శ్రీనివాస్, రామారెడ్డి, రాజేందర్, పద్మ, ఉపాధ్యాయల బృందం పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జక్రాన్‌పల్లి , జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఈ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్ అన్నారు. శనివారం జక్రాన్‌పల్లిలో సబ్‌ఖ సాత్ సాబ్‌ఖ వికాస్, సబ్‌కా విశ్వాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బీజేపీలో చేరిన జగదీశ్వర్‌ను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్య దర్శి శ్రీనివాస్, కార్యదర్శులు తిరుపతిరెడ్డి, సా యిలు, నరేందర్ రెడ్డి, విక్రం, సంతోష్, భూమేశ్వర్, విజయ్‌కుమార్,శ్రీకాంత్, రాజుల, కార్తీక్, విజయ్, దత్తుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



లోలం జగదీశ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పాఠశాలల్లో దోమల నివారణ మందు పిచికారీ



పాఠశాలల్లో దోమల మందును పిచికారి చేయిస్తున్న వైద్య సిబ్బంది

ఆర్మూర్ రూరల్ , జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని గిరిజన సంక్షేమ పాఠశాల, మామిడిపల్లిలోని తపస్వి స్వచ్ఛంద సేవా పాఠశాల, ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో శనివారం దోమల నివారణ మందును పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ సబ్‌యూనిట్ అధికారి సాయి మాట్లాడుతూ పాఠశాలలు త్వరలో ప్రారంభం కాబోతున్న సందర్భంగా వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులు వస్తారని ముందస్తుగా దోమల నివారణ కోసం మందును పిచికారి చేశామన్నారు. ప్రతీ ఒక్కరు తమ పరిసరా ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని దోమలను అరికట్టడానికి తమవంతు ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమలో వైద్య సిబ్బంది జక్కుల మోహన్, సాగర్, గణేష్, నరందర్‌లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



కుద్వాన్‌పూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న నాయకులు

నందిపేట , జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామంలో శనివారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. భామని సాయన్నకు రూ. 15వేల 500లు, వేల్పూర్ సాయినాథ్‌కు రూ. 55వేల 500లు, కాపుగంటి కమలకు రూ. 60వేలు, కోల్‌కొండ అక్కమ్మ రూ. 16వేలు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం యువమోర్చ అధ్యక్షుడు మంగ్లారపు నవీన్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సుంకరి రాజు, సీనియర్ నాయకులు చాకలి లింగన్న,శ్రీకాంత్,తేజ, మహిపాల్, అనుదీప్, వినిత్, సన్ని తదితరులున్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు బీజేపీ పట్టణ అధ్యక్షు డు మందుల బాలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాన్‌శీను, బాండ్లపల్లి నర్సరెడ్డి, ఖాందేష్ ప్రశాంత్, బాశెట్టి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

దివ్యాంగుల బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

● 9న బోధన్‌లో దివ్యాంగుల గుర్తింపు కార్యక్రమం

బోధన్‌రూరల్,జూన్7(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, బడిబాట కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులను గుర్తించడానికి ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు స్నేహ సొసైటీ ఫర్ రూరల్ కన్‌స్ట్రక్షన్ కార్యదర్శి సిద్దయ్య తెలిపారు. శనివారం ఆయన బోధన్‌లో మాట్లాడారు. ఈ నెల 9న బోధన్‌లోని మహలక్ష్మి కల్యాణ మండపంలో ఉదయం 10గంటలకు దివ్యాంగుల గుర్తింపు కార్యక్రమం ఉంటుందన్నారు. మానసిక వికలాంగులు, అంధుల ప్రత్యేక అవసరాల గుర్తింపు శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. 18సంవత్సరాల లోపు వయసు కలిగిన మానసిక వికలాంగులు, బుద్ధి వికాసం చెందని మానసిక వికలాంగుల పిల్లలను శిబిరానికి తీసుకురావాలన్నారు. చూపు తక్కువగా ఉండి బ్లాక్ బోర్డుపై రాసిన అక్షరాలు కనబడని వారు అంధత్వంతో పాటు మరొక్క వైకల్యం కలిగిన వారు అర్హులన్నారు. అంధ విద్యార్థులకు బ్రెయిలీ లిపిలో ప్రత్యేక విద్యను అందిస్తున్నామన్నారు. కావున దివ్యాంగుల, మానసిక వికలాంగుల పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట కుమార్ రోడే, స్నేహ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్‌రూరల్,జూన్7(ఆంధ్రజ్యోతి):ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్ చేసినట్లు బోధన్ తహసీల్దార్ విఠల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శనివారం సుంకిని నుంచి బోధన్ వైపుకు ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తీసుకెళ్తున్నట్లు పక్కా సమాచారంతో వాటిని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి సీజ్ చేశామన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేసిన ప్రభుత్వ నిబంధనలు పాటించకున్న కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నవీపేటలో సెల్‌ఫోన్ చోరీ

నవీపేట,జూన్7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారాంతపు సంతలో శుక్రవారం నవీపేటకు చెందిన పలారం సాయికుమార్ సెల్‌ఫోన్ చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన ప్రకారం వారాంతపు సంతలో వెదురు బుట్టలు, గంపలు అమ్ముతుండగా గుర్తు తెలియని దొంగలు తన సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. చోరీకి గురైన సెల్‌ఫోన్ సుమారు 20వేల రూపాయల విలువ ఉంటుందని, ఈ విషయంపై నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అయన పేర్కొన్నారు.

ప్రతీ వ్యక్తి మొక్కలు నాటాలి



భీమ్‌గల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

భీమ్‌గల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వ్యక్తి తనవంతుగా రెండు మొక్కలు నాటి సంరక్షించాలని భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ అన్నారు. శనివారం భీమ్‌గల్‌లోని 1వ వార్డు ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ ముందుకు సాగుతుందని ప్రతీ వ్యక్తి తమవంతుగా మొక్కలు నాటి సంరక్షించాని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు జేజే నర్సయ్య, వాక మహేష్, మున్సిపల్ మేనేజర్ నరేందర్, ఆర్పీలు పాల్గొన్నారు.







నిజామాబాద్ నగరంలో ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సంప్రదాయ వస్త్రాంకరణలో చిన్నారులు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. త్యాగానికి ప్రతీకగా ముస్లింలు ఈ పండుగను జరుపు కోవడం ఆనవాయితీ. ఉదయం పూట కొత్త దుస్తులు ధరించి సమీపంలోని ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు, బంధువులకు కుర్బాని పంపిణీ చేశారు.



●(స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్)








భిక్కనూరులో..



కళ్యాణి గ్రామంలో మురుగు కాలువలో చెత్తాచెదారం



మురికి కాలువలలో పెరిగిన పిచ్చి మొక్కలు

సమస్యల వలయంలో గ్రామాలు

● పల్లెల్లో కానరాని ప్రత్యేక అధికారులు
● పారిశుధ్యం అస్తవ్యస్తం ● పెరుగుతున్న సమస్యలు
● ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలు

ప్రగతి పట్టుకొమ్మలాంటి పల్లెలు.. స్థానిక పాలకులు లేక వెలవెల బోతు న్నాయి. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన అనంతరం ప్రత్యేక అధికారు లను నియమించినప్పటికీ వారి పర్యవేక్షణ కొరవడి సమస్యల ఒడిలో కొట్టు మిట్టాడుతున్నాయి. ఇటు మాతృ శాఖలో విదులు నిర్వహిస్తూ అటు జీపీ బాధ్యతలను విస్మరిస్తున్నారు. దీంతో తమ సమస్యలు ఎవరికి చెప్పు కోవా లో తెలియక గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఎల్లారెడ్డి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన పడకేసింది. సర్పంచుల పదవీకాలం ముగిసిన అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉన్న 526 గ్రామాలకు ప్రభుత్వం గెజిట్ స్థాయి అధికారులకు గ్రామాల ప్రత్యేక అధికారులుగా నియమించింది. మాతృ శాఖతో పాటు అదనంగా అప్పగించిన బాధ్యతలను కార్యదర్శుల భాగస్వామ్యంతో అధి కారులు నెరవేర్చాల్సి ఉంటుంది. ప్రభుత్వ పథకాలు అభివృద్ధి పనులు క్షేత్ర స్థాయిలో అమలు చేయడం, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించి సమస్యలు ఉన్నచోట చక్కదిద్దాల్సి ఉంటుంది. దాంతో పాటే ఇంటి పన్ను వసూలు పారిశుధ్య పనులపై దృష్టి సారిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలి. ప్రత్యేక అధికారులు కార్యదర్శులు, ఎంపీఓ, ఎంపీడీవో, మండల ప్రత్యేక అధికారులు కలిసి పక్షం రోజులకు లేదా నెల రోజులకు ఒకసారి గ్రామసభలు నిర్వహించాలి కానీ. ఏ గ్రామంలో సభలు నిర్వహించిన దాఖలాలు లేవన్నట్లు తెలుస్తోంది. మాతృ శాఖకు న్యాయం చేయకపోతే అదనపు బాధ్యతలు నిర్వహించలేక తలలు పట్టుకుంటున్నారు. రెండు పడవల మీద ప్రయాణం వారికి కష్టంగా మారింది.

● అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

ఎల్లారెడ్డి మండలంలో కళ్యాణి గ్రామంలో మురికి కాలువలను శుభ్రం చేయకపోవడంతో వ్యర్థ జలాలు నివాసాల మధ్య నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పశువుల నీటి తొట్టిలలో కొన్ని నిరుపయోగంగా ఉండగా మరికొన్నింటిలో సరిగా నీరు లేకపోవడం శుభ్రపరచలేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా పల్లె ప్రకృతి వనాల నిర్వహణ లేక అధ్వానంగా మారింది. గ్రామాలలో సేకరించిన తడి, పొడి చెత్త నామమాత్రంగా వేరుచేసి గ్రామ శివారు ప్రాంతాలలో పారబోస్తున్నారు. తిమ్మారెడ్డితండా, హాజీపూర్ గ్రామ పంచాయతీలతో పాటు చాలా గ్రామాల్లో ఉన్న క్రీడా ప్రాంగణలలో కొన్ని చోట్ల బోర్డులు ఏర్పాటు చేశారు, కానీ ఆట వస్తువులు ఏర్పాటు చేయలేదు. మరికొన్ని గ్రామాలలో ఉన్న క్రీడా ప్రాంగణాలలో పిచ్చి మొక్కలు రాళ్లు ఉండడంతో గ్రామీణ ప్రాంత యువకులు క్రీడలకు దూరమవుతున్నారు. ఇలా గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలతో స్థానికులు తీవ్ర సౌకర్యానికి గురవుతున్నారు. ఇదిలా ఉండగా స్థానిక ఎన్నికలు జరిగి సరంచులు కొలువుదీరేవరకు ఈ కష్టాలు తప్పేలా లేవని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● ప్రత్యేక అధికారే తెలియదు

ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో సమస్యలు పెరిగిపోతున్నాయి. పట్టించుకునే వారు లేక ముందుకు సాగని మురికి కాలువలు పేరుకు పోయిన పల్లెలు కళ తప్పాయి. సమస్యల గురించి ఎవరికీ చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో గ్రామస్తులు కొట్టుమిట్టాడుతున్నారు. అందుబాటులో లేని ప్రత్యేక అధికారి పని భారంతో కార్యదర్శి సతమతమవుతున్నారని దీంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని పలువురు పేర్కొన్నారు. అసలు ఇప్పటి వరకు ప్రత్యేక అధికారి ఎవరో కూడా గ్రామాలలో ఉన్న చాలా మంది ప్రజలకు తెలియయని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. గ్రామాలలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో సీజనల్ సమస్యలు పెరగనున్నాయని ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజా గ్రామ సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



మీసన్‌పల్లి గ్రామ శివారులో చెత్తను కాలుస్తున్న దృశ్యం

పునాది దశలోనే మార్కెట్ నిర్మాణం

● నిధుల కొరత వల్లే పనుల్లో జాప్యం

ఆర్మూర్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ప్రధాన రహదారి పక్కనే నిర్మిస్తున్న వెజ్ అండ్ నాన్ వెజ్ (సమీకృత) మార్కెట్ పునాది దశలోనే నిలిచి పోయింది. అన్ని హంగులతో అందరికి సౌకర్యంగా మార్కెట్ నిర్మించాలన్న ఉద్దేశంతో అప్పటి ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి రూ.7 కోట్ల 20లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. అనంతరం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పెర్కిట్‌లోని 44, 63వ జాతీయరహదారి కూడలి పక్కన ఇరుకు స్థలంలో మార్కెట్ నిర్మిస్తున్నారు. ఈ మార్కెట్‌ను తరలించి అన్ని హంగులతో నూతన మార్కెట్ నిర్మించాలని ఆర్‌అండ్‌బీ కార్యాలయ స్థలంలో పనులు ప్రారంభించారు.

ఆదాయం ఉన్న వసతులు కరువు..

పెర్కిట్‌లోని ప్రస్తుతం బస్టాండ్ సమీపంలో అంతర్గత రోడ్డుకు ఇరువైపుల ప్రతీరోజు కూరగాయల మార్కెట్ నిర్వహిస్తున్నారు. ఆర్మూర్ ప్రాంతంలోని వివిధ మండలాలతో పాటు వివిధ గ్రామాల రైతులు, నిర్మల్ జిల్లా రైతులు సైతం తాము పండించిన కూరగాయలను పెర్కిట్ మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. దూర ప్రాంతం నుంచి కూరగాయలు తీసుకువచ్చే విక్రయించే వారితో పాటు వినియోగదారులతో మార్కెట్ నిత్యం రద్దీగా ఉంటుంది. పేరుకు పెద్ద మార్కెట్ అయిన వసతులు కరువై ప్రజలు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. మార్కెట్‌లో ప్రజలు, వినియోగదారులు ఎండకు, వానకు ఇబ్బందులు పడాల్సిందే తప్ప షెడ్ల నిర్మాణం లేకపోవడంతో అసౌకర్యంగా మారింది. దీంతో గత పాలకులు మార్కెట్‌ను తరలించి అన్ని హంగులతో వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చి నిధులు మంజూరు చేయించారు. ప్రారంభమైన పనులు మాత్రం పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి. ఆర్మూర్ మున్సిపాలిటీకి మార్కెట్ వల్ల ఆదాయం వస్తున్న కనీస సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని విమర్శలు వస్తున్నాయి. మామిడిపల్లి గ్రామ పంచాయతీ వద్ద పెర్కిట్‌లో రెండు చోట్ల మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. మార్కెట్‌ల నిర్వహణ ద్వారా మున్సిపాలిటీకి లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. నూతనంగా నిర్మిస్తున్న వెజ్ అండ్ నాన్‌వెజ్ (సమీకృత) మార్కెట్‌ను తొందరగా నిర్మించి తమ సమస్యలను దూరం చేయాలని విక్రయ వినియోదారులు కోరుతున్నారు.



పెర్కిట్‌లో పిల్లర్ల దశలోనే నిలిచిన మార్కెట్ పనులు

ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే పనులు ప్రారంభిస్తాం

● రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

గత ప్రభుత్వం వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పనులు కొంత మేరకు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం మారగానే రాష్ట్రవ్యాప్తంగా పనులు నిలిచి పోయాయి. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే పనులు ప్రారంభించి మార్కెట్ భవన నిర్మాణాన్ని పూర్తిచేసి రైతులకు, ప్రజల కు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటాం.



యాద్గార్‌పూర్‌లో బోనాలు ఎత్తుకుని వెళ్తున్న మహిళలు

యాద్గార్‌పూర్‌లో ఘనంగా బోనాల పండుగ

కోటగిరి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఇటీవల గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు శనివారం ప్రత్యేకంగా బోనాలు సమర్పించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలు ఎత్తుకుని బాజాభజంత్రీలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. చెరువు కట్ట వద్ద గంగమ్మ ఆలయంలో అభిషేకం, హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలను కొలిచినప్పుడే గ్రామం సుభిక్షంగా ఉంటుందని, పంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామస్థులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు కిష్టయ్య, కృష్ణకుమార్, సాయిలు, లక్ష్మణ్, లాలయ్య, ముత్తయ్య, మహేష్ గౌడ్, శ్రీధర్, కాశీరాం, చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన విద్యార్థి

భీమ్‌గల్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబానగర్ గ్రామ పంచాయితీ పరిధిలోని తాళ్ళకుంట తండాకు చెందిన లింబాద్రి అనే విద్యార్థి ఎవరెస్ట్ అడ్వెంచర్ శిబిరానికి ఎంపికై, రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 20 మంది విద్యార్థులతో మే నెలలో ఎవరెస్టు శిఖిరానికి వెళ్లారు. శనివారం నాటికి 5,150 మీటర్ల ఎత్తులోని నార్త్ ఎవరెస్ట్ బేస్ క్యాంపు చేరుకున్నారు. ఈ విద్యార్థి ప్రస్తుతం నిజామాబాద్‌లోని నూత్‌పల్లి బాలుర పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువున్నాడు. చిన్న వయసులోనే ఎవరెస్ట్ అధిరోహించిన విద్యార్థినిని గ్రామస్థులు అభినందించారు.

పల్లెల్లో సాగు సందడి

మద్నూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడంతో అన్నదాత కదిలాడు, ఏరువాక పౌర్ణమికి ముందే సాగు పనులు ప్రారంభమయ్యాయి. రైతులు తమ భూముల్లో పత్తి కట్టే తీయడం భూములను దుక్కులు దున్నడం యంత్రాలు, ఎద్దుల సాయంతో వ్యవసాయం భూములను సిద్ధం చేస్తున్నారు. సేంద్రియ ఎరువులు చల్లుతున్నారు. ఒక పక్క విత్తన శుద్ధి చేస్తూ మరో పక్క విత్తనాలు చక చక వేస్తున్నారు. పల్లెలు వ్యవసాయ పనులతో కళకళలాడుతున్నాయి. ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాలలోని గ్రామ శివారులో రైతులు వ్యవసాయ కూలీలతో కళకళలాడుతున్నాయి. రైతులు తమ భూముల్లో పంటలు సాగు చేయడానికి సిద్ధమయ్యారు. నైరుతి రుతు పవనాలు ముందస్తుగానే ప్రవేశించడంతో ముందస్తు వానలు పడుతున్నాయి. రైతులు సాంప్రదాయకంగా విశ్వసించే మృగశిర కార్తె సైతం జూన్ 8న ప్రవేశిస్తుండడంతో ఇప్పటికే వర్షాలు బలంగా కురియడంతో ఆరుతడి పంటలు వేయడానికి రైతులు తమ పంట భూముల్లో పనులు చేసుకుంటున్నారు.



భూముల్లో పత్తి కట్టే ఏరుతున్న కూలీలు



వ్యవసాయ పనులకు ఎద్దులను తీసుకెళుతున్న రైతు

ఖాళీగా ప్రభుత్వ వృద్ధాశ్రమం

● రాంపూర్‌లో ప్రారంభమైన ఏకైక ప్రభుత్వ వృద్ధాశ్రమం
● సర్వ హంగులు, వసతుల కల్పనతో ఏర్పాటు ● నిర్వహణ బాధ్యతలు చూస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ

డిచ్‌పల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎవరూ లేని అనాథ వృద్ధులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో రాంపూర్ (డి) గ్రామంలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ ప్రత్యేక కృషితో ఈ అనాథ ఆశ్రమం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ వృద్ధ ఆశ్రమంలో అన్ని రకాల సేవలు అందించేందుకు వసతులు కల్పించారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా గదులను ఏర్పాటు చేశారు. సుమారు కోటిన్నర రూపాయలతో ఈ ప్రభుత్వ వృద్ధ ఆశ్రమం నిర్మించారు. వృద్ధ ఆశ్రమం ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేయించారు. దీనిని రెడ్‌క్రాస్ సోసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వృద్ధులకు ఉదయం టీ, టిఫిన్స్, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో భోజనం అందిస్తున్నారు. కానీ ఆశ్రమంలో ప్రవేశాలపై ప్రచారం లేకపోవడంతో వృద్ధులు ఏవరు రాలేదు. ప్రస్తుతం కేవలం ఒకే ఒక్క మహిళ వృద్ధురాలు ఉంటుంది. ఆశ్రమం పచ్చని చెట్లు, పచ్చిక బైళ్లతో ప్రశాంతమైన వాతవరణం కల్పించారు. విస్తీర్ణమైన గదులు, మంచాలు, ఆధునాతన ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. ఆశ్రమం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రత పర్యవేక్షిస్తున్నారు. ఇలా అన్ని రకాల సర్వహంగులు వసతులు ఉన్న ఈ ఆశ్రమంపై ప్రచారం లేకపోవడంతో వృద్ధులు రావడం లేదు. జిల్లా, మండల అధికారులు ఈ ఆశ్రమంపై ప్రచారం కల్పించి వృద్ధులకు సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు. జిల్లాలో ఏకైక ప్రభుత్వ వృద్ధ ఆశ్రమం కావడం గమనార్హం. అనాథ వృద్ధులు ఏవరైన ఉంటే 98499 33300 నంబర్‌కు సంప్రదించాలని రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు తెలిపారు.



రాంపూర్‌లోని ప్రభుత్వ వృద్ధాశ్రమం ఇదే



పురుషులకు, మహిళలకు వేర్వేరుగా గదుల ఏర్పాటు



ఆశ్రమంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



ఆశ్రమంలో పచ్చని చెట్లు

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి , జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తొర్లికొండ గ్రామంలో శనివారం వేంకటేశ్వర స్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునుంచే భక్తులు కొండపైకి చేరుక న్నారు. అనంతరం స్వామివారి పల్లకిని కొండపై చుట్టూ ప్రదక్షణ చేయించారు. ఆలయం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంజీవ్‌గౌడ్, ఆలయ కమిటి సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


బడీడు పిల్లలతో ఉపాధ్యాయులు

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

ఇందల్వాయి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను బడిలో చేర్పించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకు రావాలని ఎంఈవో శ్రీధర్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో సుమారు 400 మంది బడిఈడు పిల్లలను గుర్తించామన్నారు. ప్రతీ గ్రామానికి ఉపాధ్యాయులు వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు పిల్లలను స్కూల్‌కు పంపేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా కరపత్రాలు, ఫ్లెక్సీలు, ప్లకార్డులతో ప్రదర్శిస్తు ప్రతి ఇంటికి తిరుగుతూ తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామ సభలు, ర్యాలీలలో అవగాహన కల్పిస్తున్నారు. బడిబాట కార్యక్రమానికి తల్లిదండ్రులు పూర్తిమద్దతు కల్పించాలని ఎంఈవో శ్రీధర్ కోరారు.

టీయూసీఐ మహాసభల గోడప్రతుల ఆవిష్కరణ

నిజామాబాద్ కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర మహాసభల గోడప్రతులను టీయూసీఐ నాయకులు ఆవిష్కరించారు. జిల్లాకేంద్రంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ, జిల్లా నాయకులు గోడప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా వనమాల కృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, అన్నిరకాల వస్తువుల ధరలు పెరగడం అందుకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని అన్నారు. కార్మికుల జీవితాలు రోజురోజుకి దుర్భరంగా మారుతున్నాయని అన్నారు. అదేసమయంలో దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను రద్దుచేసే కుట్రలో కేంద్రప్రభుత్వం చేస్తోందని అన్నారు. కార్మిక అనుకూల చట్టాలను కుదించి 4లేబర్ కోడ్‌లను కేంద్రప్రభుత్వం మోదీ నాయకత్వంలో తీసుకురావడానికి ప్రయత్నిస్తోందని అన్నారు. మొదటి రోజు ర్యాలీ, బహిరంగ సభ, రెండో రోజున ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్, సుధాకర్ తెలిపారు. మహాసభలకు టీయూసీఐ జాతీయ నాయకులు, రాష్ట్ర ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, సహాయ కార్యదర్శి మల్లేష్, నాయకులు సాయన్న, కిరణ్, చరణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగుల పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి'

నిజామాబాద్ అర్బన్, జూన్7 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన ఉద్యోగుల, రిటైర్డ్ ఉద్యోగులకు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబిల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు ఒక డీఏ ప్రకటించి మరో డీఏను 10 నెలల తర్వాత చెల్లిస్తామని చెప్పడం సరికాదని అదే విధంగా ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ సంబంధించి ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో పాటుగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను ముందుగా బదిలీ చేయాలని అన్నారు. పీఆర్సీ గురించి మాటమాత్రం కూడా చర్చించకపోవడం సరికాదని అన్నారు. ప్రభుత్వ బడులను, ప్రభుత్వ ఆసుపత్రులను పటిష్ఠం చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త ప్రచారంలో భాగంగా ఆయన నగరంలో పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, ఈవీఎల్ నారాయణ, అమీద్ ఉద్దీన్, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

నిజామాబాద్ అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం కాంట్రాక్టు విధానాన్ని తొలగించి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ సమావేశం సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు పెంచుతామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇంకా ఎలాంటి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో గత వేతనాల టెండర్ కాలపరిమితి ముగుస్తున్నందున కార్పొరేషన్ ఏర్పాటు చేసి వేతనాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు భాగ్యలక్ష్మి, స్వరూప, భారతి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

ఇందల్వాయి, జూన్7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన గూండ్ల కిషన్ (45) ప్రమాదవశాత్తు చెరువులో మునిగి శనివారం మృతి చెందాడు. గ్రామ ఊర చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య శ్రావణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నవీపేటలో సెల్‌ఫోన్ల చోరీ

నవీపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారాంతపు సంతలో శుక్రవారం నవీపేటకు చెందిన పలారం సాయికుమార్ సెల్‌ఫోన్ చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన ప్రకారం వారాంతపు సంతలో వెదురు బుట్టలు, గంపలు అమ్ముతుండగా గుర్తు తెలియని దొంగలు తన సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. చోరీకి గురైన సెల్ ఫోన్ సుమారు రూ.20వేల విలువ ఉంటుందని, ఈ విషయంపై నవీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

మాల మహానాడు ఆలూర్ మండల నూతన కమిటీ ఏర్పాటు

ఆలూర్, జూన్7 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల మహనాడు అధ్యక్షుడిగా అగ్గు క్రాంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో శనివారం మాలమహానాడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాలమహానాడు సభ్యులు ఏకగ్రీవంగా అగ్గు క్రాంతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇట్టి కార్యక్రమానికి మాలమహానాడు జిల్లా నాయకులు హాజరయ్యారు. ప్రధాన కార్యదర్శిగా చిట్టిబాబు, మిర్దాపల్లి, ఉపాధ్యక్షుడుగా దండు రవి, మచ్చర్ల కోశాధికారిగా పిట్ల శోభన్‌లను నియమించారు. అనంతరం నియామక పత్రాన్ని వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు దేవిదాస్, ఆలూర్ మండల ప్రెసిడెంట్ అగ్గు క్రాంతికి అందజేశారు.

పశువులలో గొంతువాపు వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

డొంకేశ్వర్ జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే గొంతువాపు వ్యాధిపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్య అధికారి శ్రీకాంత్ తెలిపారు. శనివారం డొంకేశ్వర్ మండలం అన్నారం, సిర్పూర్ గ్రామాల్లో పశువులకు గొంతువాపు, ముద్ద చర్మవ్యాధి, నివారణ టీకాలు వేశారు. ఈ వ్యాధి ముఖ్యంగా ఆవు, గేదెల్లో అధిక జ్వరంతో శ్వాస తీసుకోవడంలో కష్టమై గొంతుకింద మెడ దగ్గర వాపు వచ్చి ఒకరోజులోనే పశువులు మరణిస్తుందన్నారు. అందువల్ల సకాలంలో టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. ముద్ద చర్మవ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వాటికి సోకుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది నర్సయ్య, ధర్మోజి, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

నిజామాబాద్‌అర్బన్, జూన్7 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని బాసరలో ఇళ్లను కిరాయికి తీసుకొని జిల్లాలో దొంగతనానికి పాల్పడుతున్న ముఠా సభ్యులను 1వ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. జగిత్యాలకు చెందిన షేక్ యామిన్ అలియాస్ గోపి, ఆదిలాబాద్‌కు చెందిన సయ్యద్ ఫారుఖ్‌లు 20కి పైగా కేసులలో జైలుకు వెళ్లి వచ్చి మళ్లీ దొంగతనాలు చేస్తున్నట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో పార్క్ చేసిన బైక్‌ను దొంగతనం చేసి అదే బైక్‌పై తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని దొంగతనం చేద్దామని నగరంలో తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని విచారించగా తాము ఒక ముఠాగా ఏర్పడి జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు నిందితులు తెలిపినట్లు పోలీసులు తెలిపారు. ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధితో పాటు నగరంలోని 3వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో, జక్రాన్‌పల్లిలోని ఓ బెల్ట్ షాపులో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. రైళ్లలో తిరుగుతూ మొబైల్ ఫోన్‌లు దొంగతనాలు చేస్తూ కోంపల్లికి చెందిన మన్మోహర్ అరవింద్ ప్రసాద్‌కు అమ్మి వచ్చిన డబ్బులను అందరూ పంచుకున్నట్లు నిందితులు తెలిపారు. ముఠాలోని ఏ3గా ఉన్న సత్యం పరారీలో ఉన్నాడని నిందితుల నుంచి 5వేల నగదు, 5 సెల్‌ఫోన్‌లు, టీవీ, 2 బైకులను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చినట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో తెలిపారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

సిరికొండ, జూన్7 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పండుగను సిరికొండలో ముస్లిం ప్రశాంతంగా ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని సిరికొండ, కొండూర్, పెద్ద వాల్గోట్, చిన్నావాల్గోట్, న్యావనంది, హుస్సేన్‌నగర్, రామడుగు, గడ్కోల్, కొండపూర్ తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాలు, ప్రార్థనా మందిరాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


డిచ్‌పల్లిలో ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు


సిరికొండలో ముస్లింల ప్రార్థనలు

డిచ్‌పల్లిలో..

డిచ్‌పల్లి, జూన్7 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లిలో ముస్లింలు శనివారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. డిచ్‌పల్లి మైనార్టీ సంఘం ప్రతినిధి ఈద్గ వద్ద మౌలాన మోసిన్‌రజ బక్రీద్ పండగ ప్రాముఖ్యత, కురుబని విశిష్టత వివరించారు. ప్రతీఒక్కరు సోదర భావంతో మెదగాలని ఆయన సూచించారు. డిచ్‌పల్లి, ఖిల్లా డిచ్‌పల్లి, పోలీస్ బెటాలియన్, ఇస్లాంపూర, ఘన్‌పూర్, ధర్మారం(బి), బర్దిపూర్ లో ముస్లిం సోదరులు ఈద్గల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి, మాజీ ఎంపీపీ చిన్నోళ్ల ముల్లంగి నర్సయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగాధర్, డాక్టర్ షాదుల్లాలకు శుభాకాంక్షలు తెలిపారు.

'విద్యుత్ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి'

మోపాల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి విద్యుత్ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భూపతిరెడ్డిని కలిసి సమస్యలను విన్నవించారు. డిచ్‌పల్లి డివిజన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూపతిరెడ్డిని ఐఎన్‌టీయూసీ 327 కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ పూదారి గంగాదర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లాప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు, ఎడ్ల నాగరాజు, అంజయ్య, మోహన్, పాల్గొన్నారు.

దివ్యాంగులు సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

సిరికొండ, జూన్7 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌ల నుంచి సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తుల చేసుకోవాలని ఎండీవో మనోహర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల వారు వెబ్ పోర్టల్లో ఈనెల 7 నుంచి 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు దారుల అవసరాన్ని బట్టి సహాయ ఉపకరణాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

ఇద్దరి రిమాండ్

మోపాల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళను ఇద్దరు అత్యాచారం చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై యాదగిరి తెలిపారు. సీఐ నరేష్ ఆదేశాల మేరకు శనివారం ఇద్దరిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఇటీవల ఓ గ్రామానికి చెందిన బాలిక అత్యాచారానికి గురైన విషయం తెలిసిందే.

నవీపేటలో ఎమ్మెల్సీ కవిత పర్యటన

(5వ పేజీ తరువాయి)

అబ్బన్న మాతృమూర్తి గుండెపోటుతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరా మర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో పలువురు మండల బీఆర్ఎస్ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడపల్లిలో పర్యటించిన ఎమ్మెల్సీ కవిత

ఎడపల్లి: నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం ఎడపల్లిలో పర్యటించారు. మండల జాగృతి నాయకుడు రంజిత్‌కు ఇటీవల వివాహం కాగా నూతన వధూవరులను ఎమ్మెల్సీ కవిత ఆశీర్వదించారు. అనంతరం కుర్నాపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సావిత్రీ రవీందర్‌గౌడ్ ఇంటికి వెళ్లి వారితో కాసేపు మాట్లాడారు. ముస్లిం సోదరుకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆమెవెంట పలువురు మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక ప్రార్థనలతో సందడిగా మారాయి.

ప్రార్థనలో పాల్గొన్న మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారి

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వ హించిన ప్రార్థనలో మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారి పాల్గొన్నారు. ముస్లింలను అలయ్ బలయ్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతిరూపకంగా జరుపుకునే పండుగ బక్రీద్ అని అన్నారు. ప్రతీ ఒక్క ముస్లిం దైవప్రవక్త చూపిన మార్గంలో నడుచుకొని ఆనందమైన జీవితాన్ని అందుకోవాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మోపాల్, జూన్7 (ఆంధ్రజ్యోతి): బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోపాల్ మండలం ఫిట్నెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన 11వ జిల్లా సెక్షన్ టోర్నమెంట్‌లో వివిధ విభాగాల్లో క్రీడాకారులు విజయం సాధించారని అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి వాసు, కెవి కిరణ్ తెలిపారు. ఎంపికైన వారు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. పురుషులు, మహిళల విభాగంలో సింగిల్స్ విన్నర్స్‌లో పి.ప్రణయ్ శ్రీకర్, రన్నర్ కె.మానవ్, డబుల్స్ విన్నర్ కె.ప్రణయ్, ఎం.రోహిత్, మహిళా సింగిల్ విన్నర్ ఏ.శ్రీవల్లి, డబుల్స్ విన్నర్ ఎస్‌వీఎస్ శ్రీవైష్ణవి, ఏ.శ్రీవల్లి, మిక్స్ డబుల్స్ విన్నర్ దుర్కికర్ సాయిచరణ్, జి.కనిష్క, సింగిల్స్ విన్నర్ బాలురు కె.మానవ్, రన్నర్ ఎస్.విశ్వక్, డబుల్స్ విన్నర్ బాలురు ఎం.విశ్వజిత్, ఎస్.విశ్వక్, అండర్17 బాలురు సింగిల్స్‌విన్నర్ ఎం.విశ్వజిత్, రన్నర్ కె.కార్తికేయ, డబుల్స్ విన్నర్ బాలురు ఎం.వాస్తవ, వై.రూపాలు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కోశాధికారి ఎం.సాయిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు పి.ప్రకాష్, సంయుక్త కార్యదర్శి గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన క్రీడాకారులు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

కర్మజీవి పుస్తకావిష్కరణ

నిజామాబాద్ కల్చరల్, జూన్7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి ఇప్పకాయల సుదర్శన్ రచించిన కర్మజీవి పుస్తకాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆవిష్కరించారు. శనివారం జిల్లాకేంద్రంలోని మార్కండేయ మందిరంలో జరిగిన కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులు చేసేలాగా కవులు తమ కలం నుంచి కవితలను రాయాలని అన్నారు. ప్రముఖగాయకుడు సిర్పలింగం ఆలపించిన సామాజిక గీతాలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం సుదర్శన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు గణపతి అశోక్‌శర్మ, కాసర్ల నరేష్‌రావు, వీపీ చందన్‌రావు, శ్రీమన్‌నారాయణ, నగర పద్మశాలి సంఘం అధ్యక్షుడు దత్తాద్రి, కార్యదర్శి భూమేశ్వర్, కోశాధికారి మోరసాయిలు, ఇప్పకాయల హరిదాస్ పాల్గొన్నారు.

మా హాస్టల్ కథల పుస్తక ఆవిష్కరణ

భట్టిప్రోలు కథలు, దేవతా వస్త్రాలు వంటి ఎనిమిది సంపుటాల కథలు, నాగమ్మ నవల రాసిన ప్రసిద్ధ రచయిత నక్కా విజయ్‌రామరాజు విడుదల చేసిన మా హాస్టల్ కథల పుస్తకాన్ని రాగమాలిక సాహితీ సాంస్కృతిక సమైక్య శనివారం ఆవిష్కరించింది. జిల్లాకేంద్రంలోని సంస్థ కార్యాలయంలో డాక్టర్ నీలిరాంచందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రచయితలతో కలిసి పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ్‌రామరాజు సాహిత్య ప్రతిభను పుస్తకంలో మరొకసారి చూపించారని అన్నారు. అనంతరం రచయితలు విజయ్‌రామరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీపీ చందన్‌రావు, తొగర్ల సురేష్, గంగాధర్, కళాగోపాల్, రచయితలు, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం.. మరింత ఆలస్యం!

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తులు వచ్చాయి. ఎస్టీ కార్పొరేషన్‌లో 1347 టార్గెట్ కాగా కేవలం 19 దరఖాస్తులు వచ్చాయి. బీసీ కార్పొరేషన్‌లో 3331 టార్గెట్ కాగా 883 దరఖాస్తులు వచ్చాయి. ఈబీసీ టార్గెట్ 972 ఉండగా 47 దరఖాస్తులు వచ్చాయి. మైనార్టీ కార్పొరేషన్‌కు 485 టార్గెట్ కాగా 575 దరఖాస్తులు వచ్చాయి. క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు టార్గెట్ 26 కాగా 20 దరఖాస్తులు వచ్చాయి. లక్షలోపు రుణాలకు సైతం ఆశించిన మేర దరఖాస్తులు రాలేవు. లక్షలోపు 5509 టార్గెట్ కాగా టార్గెట్ కంటే తక్కువగా 5486 దరఖాస్తులు వచ్చాయి. 2లక్షలలోపు రుణాలకు 4641 టార్గెట్ కాగా 9665 దరఖాస్తులు వచ్చాయి. 4లక్షలలోపు రుణాలకు మాత్రం అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. అన్ని కార్పొరేషన్‌లు కలుపుకొని 2లక్షల నుంచి 4లక్షలలోపు రుణాలకు మొత్తం టార్గెట్ 4845 కాగా జిల్లాలో 41వేల 823 దరఖాస్తులు వచ్చాయి.

విద్యార్థుల చెంతకే అధ్యాపకులు

(5వ పేజీ తరువాయి)


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమ్మర్‌పల్లి ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు

ప్రచారం సాగిస్తున్నారు. తమ కళాశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తున్నామని వివరించారు. ప్రతీ ఏట ఉత్తీర్ణత శాతం పెరుగుతోందని, విద్యార్థులు ఏ గ్రూప్ తీసుంకుంటే బాగుంటుందో అవగాహన కల్పిస్తూ వారికి ఇష్టమైన సబ్జెక్ట్ తె లుసుకుని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడిట్ ఎడ్యూకేషన్ యాప్‌లో నమోదు చేసుకుంటున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్ర చారం చేస్తున్నారు. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు ఏక రూప దుస్తులు, మధ్యాహ్న భోజనాలు, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే విద్యాబోధన, డిజిటల్ తరగతులు, ప్రత్యేక సదుపాయాలను పొందు పరుస్తూ ఉత్తీర్ణత శాతం తదితర అంశాలతో కూడిన కరపత్రాలతో ప్రచారం సాగిస్తున్నారు. గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రచారం చేస్తూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా అదేతీరున మండలంలోని ప్రైవేటు పాఠశాలలు సైతం ప్రచారాలను ముమ్మరం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ పాఠశాల విద్యార్థుల ఉత్తీర్ణత, సాధించిన మార్కులు, క్రీడల్లో ప్రావీణ్యం పాఠశాలల్లో సదుపాయాలు పొందుపర్చిన కరపత్రాలతో ప్రచారం సాగిస్తున్నారు.

మెదడు చెప్పే మాట వినండి

● నేడు ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవం

నిజామాబాద్‌అర్బన్, జూన్7 (ఆంధ్రజ్యోతి): మానవ శరీరంలో మెదడు కీలక అవయవంగా పనిచేస్తుంది. శరీర నిర్మాణం వ్యవహారం మొత్తం మెదడు నుంచే నడుస్తుంది. అలాంటి మెదడులో అలజడి రేగితే శరీరం మొత్తం, నాడి వ్యవస్థ మొత్తం స్తంభించి పోతోంది. మెదడులో వచ్చే కణితుల వల్ల ఎక్కువ ప్రమాదాలు ఉండే అవకాశం ఉంటుంది. ప్రజలకు ఈ కణితులపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ ప్రతీ సంవత్సరం జూన్ 8న ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ప్రస్తుతం ప్రపంచంలో ప్రతీ లక్ష మందిలో ఏడుగురు బ్రెయిన్ ట్యూమర్ బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. నిత్యం మనం తలనొప్పిని పని ఒత్తిడిగా, మతిమరుపును వయస్సు ప్రభావంగా, తలతిరగడాన్ని అలసటగా తీసుకుంటాం. కానీ ఒక్కోసారి ఈ సాధారణ లక్షణాలే మెదడులో ఒక తీవ్రమైన సమస్యకు సంకేతాలు కావచ్చు. ఆ లక్షణాలే బ్రెయిన్ ట్యూమర్‌కు దారి తీసే అవకాశాలు ఉన్నాయి. ఉదయం పూట తరచుగా వచ్చే తీవ్రమైన తలనొప్పులు, వ్యక్తిత్వంలో అకస్మాత్తుగా మార్పులు, చూపు మసకబారడం, మాట తడబడడం, మతిమరుపు, గతంలో ఎప్పుడు లేని ఫిట్స్ వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దని అది బ్రెయిట్ ట్యూమర్ సంకేతాలు కావచ్చని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఒక చిన్న స్కానింగ్ ద్వారా వ్యాధిని నిర్ధారించుకొని సరైన సమయంలో సరైన చికిత్స పొందడం ద్వారా వ్యాధిని నిర్మూలించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

నిర్లక్ష్యం చేయవద్దు

● డాక్టర్ శ్రీకృష్ణ ఆధిత్య, న్యూరో సర్జన్



బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి పట్ల అవగాహన పెంచడం, ముందు గానే లక్షణాలను గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా బ్రెయిన్ ట్యూమర్‌ను తగ్గించి ప్రాణాలు కాపాడవచ్చు. బ్రెయిన్ ట్యూమర్ పిల్లల నుంచి మొదలుకొని పెద్దవారి వరకు ఎవరికైనా రావచ్చు. ఈ వ్యాధి విషయంలో నిర్లక్ష్యం చేయవద్దు. సరైన సమయంలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను కాపాడటంతోపాటు జీవననాణ్యతను పెంపొందించే అవకాశాలు ఉంటాయి.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.110	రూ.190	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	: రూ.120	రూ.200	రూ. 230

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.97,300	రూ.89,900	రూ.1050

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కరాటే కిడ్ లెజెండ్స్ (తెలుగు) (11.00)
: మిషన్ ఇంపాజిబుల్ (ఇంగ్లీష్) (1.15)
: భైరవం (4.45, 10.35)
: బూల్ చౌక్ మాఫ్ (హిందీ) (7.55)
స్క్రీన్-2 : హౌజ్‌ఫుల్-5 (హిందీ) (9.40, 3.40, 7.10, 10.40)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (1.10)
స్క్రీన్-3 : ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (11.30), బద్మాషులు (2.00)
: థగ్ లైఫ్ (4.35, 10.40)
: పాడేరు 12 మైలు (8.00)
స్క్రీన్-4 : మిషన్ 007 (11.05), హౌజ్‌ఫుల్-5 (1.40)
: శ్రీశ్రీశ్రీ రాజావారు (5.10, 10.45)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (8.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : థగ్ లైఫ్ (1.25, 7.35, 10.40)
స్క్రీన్-2 : శ్రీశ్రీశ్రీ రాజావారు (10.30, 4.30, 10.33)
: భైరవం (1.30, 7.30)
స్క్రీన్-3 : హౌజ్‌ఫుల్-5 (హిందీ) (10.30, 1.25, 4.30, 7.35, 10.40)

లలితామహాల్ : భైరవం (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : శ్రీశ్రీశ్రీ రాజావారు (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : హౌజ్‌ఫుల్-5 (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : థగ్ లైఫ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్